# మా యాజులు

సరిగ్గా పొద్దున్న ఆరుగంటలకి బండి దిగాం; ఏడుగంటలకి పందెం ఆడాలన్నారు. మొదటినాడు మా టీము అదృష్టం ఉండి నెగ్గింది. రాత్రి నిద్రలేక పోవడం మూలాన్ని అందరికీ కాళ్ళు తేలి పోతున్నాయి.

మేమూ మా యాజులూ మొత్తం ఏడుగురం. యాజుల్ని వేరుగా ఎందుకు చెపుతున్నానంటే వాడు అసలు టీములో లేడు. తక్కిన ఆరు గురిలోనూ అయిదుగురు ఆటగాళ్ళు, ఒకడు కొసరు. కాని యాజులు లేకుండా మేం ఏ టోర్నమెంటుకీ వెళ్ళలేదు.

ఆట అయిపోయిన తరవాత అందరమూ చెరువుకి స్నానాలకి బయలుదేరాం. ఎండ కొంచెం చుర్రుమంటోంది. మట్టిరోడ్డు మీద బెడ్డలు సూదుల్లా గ్రుచ్చుకుంటున్నాయి; ఆడిఆడిన కాళ్ళకి. అలికిన అరుగుల వాసన, ఎండిన గడ్డివాసన వింతగా మెల్లగా వస్తున్నాయి.

"ఓ! ఎంత బాగుందిరా, ఈ ఊరు!" అన్నాడు శంకరం. ఆ రోజు ఆటలో వాడు వీరుడు. ఏదో ఆవహించినట్టు ఆడాడు.

"నేను మనది తప్పకుండా పోతుందనుకున్నానురా!" ఇంకా నెగ్గిన సంగతి అనుమానమేమో నన్నట్టుగా అన్నాడు వెంకట్రావు

"శంకరం వీరన్నా ఆడారురా ఈవేళ ఎంత ఆటైనా !" అన్నాడు ముందునడుస్తో యాజులు.

ఇళ్ళపైన ఎత్తుగా పెరిగిన కొబ్బరిచెట్లు గాలికి తలంతా ఒక పక్కకి విరబోసుకున్నట్టుగా ఆడుతున్నాయి. ఎండపడి ఆకులు తళతళ మెరుస్తున్నాయి. ఆవీధి చివర ఎక్కడో దూరంగా పొలాలూ తోటలూ ఆకుపచ్చగా ఆనుతున్నాయి. పండిన దాళవా చేలు అస్పష్టంగా ఆఎండలో మెరుగుపెట్టిన పసుపురంగులా కనపడుతున్నాయి.

కుడిచేతి మీదుగా సందులోకి మళ్ళాము. ఒకపెద్ద చెరువు కనబడింది. వెడల్పు ఒక ఏభయిగజాలు ఉంటుంది. పొడుగు ఆ దూరపు పొలాలలో కలిసిపోయింది. నీలంగా శుభ్రంగా ఆకాశం ప్రతిబింబించిన ఆనీటిమీద చిన్నకెరటాలు లేస్తున్నాయి; నిగనిగ మెరుస్తున్నయి.

"ఓ, యెంత బాగుందిరా !" అన్నాడు శంకరం.

"ఏమండీ యాజులూసాబ్ !" ఖాన్ వెనకనించి పలకరించాడు. అంతా వెనక్కితిరిగి చూచారు. ఖానూ, అతని జట్టూవస్తున్నారు.

"మమ్మల్ని ఇంత తొందరగా రోడ్డెక్కించార్ సార్ !"

ఓడిపోయిన ఆ జట్టులో అందరి ముఖాలూ అకారణంగా దేని మీదో కోప్పడుతున్నట్టున్నాయి.

"మాటీము ఏమనుకున్నారు మరీ ?" యాజులు అన్నాడు ప్రగల్భంగా.

"అదికాదండీ !" మొదటినించీ చెపుతున్నానండీ నేను; ఖాన్. సెంటర్" ఆడాలని. నర్సయ్య బాలా చిరాకుగా ఉడుకుబోతుతనంగా అన్నాడు.

"పోనీరా ! అయిపోయిం తరవాత యింత గొడవ !" అన్నాడు ఖాన్.

శంకరం నీట్లోకి ఊరికి బాతులా మునకలు వేస్తూ తేలుతున్నాడు.

"ఓ, ఎంత బాగుంది!" ఊరికే చేతులు కొట్టుకునే చంటి పిల్లవాడిలా కొట్టుకుంటున్నాడు నీరు ఊకదిపేస్తో.

"నాక్కాస్త ఈతనేర్పరా!" అన్నాడు యాజులు తనుకూడా దిగి
"వీరన్న వెధవ దెబ్బకొడితే నోరావలించాడు; మనప్రబుద్ధుడు;
పెద్ద సెంటరు!" నర్సయ్య అన్నాడు ఉడుకుబోతుగా.

"పోయే సమయానికి అన్నీ అల్లా వొస్తాయిరా" అన్నాడు తప్పు
ఒప్పుకొంటున్నట్టుగా వాళ్ళ సెంటరు.

"ఎందుకయ్యా అంత గోలపెడుతారు, వాళ్ళు మాత్రం తక్కువ
టివ్మా?" ఖాన్ అన్నాడు.

శంకరం మధ్యకి ఈదుకుపోయాడు. ఒక చోట మునిగి ఇంకో
చోట తేలుతున్నాడు. నీళ్ళు పెద్ద కెరటాలుగా లేచి తామర ఆకుల్నీ
పువ్వుల్నీ ఊరికే అల్లల్లాడిస్తూ వున్నాయి.

"ఓ! ఎంత చల్లగా ఉన్నాయిరా, నీళ్ళు!"

యాజులు రొమ్ములోతు నీళ్ళల్లో ఈతకొట్టినట్టు నటిస్తో ఖాన్‌తో
అన్నాడు; "క్యాజీ, ఖాన్‌సాబ్! రాత్రికి ఎక్కడన్నా ఏర్పాట
యిందా?"

"ఇది కొత్త ఊరు బాబూ! చెమడా లెగుర్తయ్ పిచ్చయేసాలేస్తే"
ఖాన్ అన్నాడు.

నర్సయ్య సబ్బు రుద్దుకొంటో అనుకున్నాడు తనలో తనే:
"ఖాన్ సెంటర్ ఆడితే!"

వెంకట్రావు నీరసంచేత మెట్లమీద నీళ్ళల్లో కూర్చుని కాళ్ళు
పిసుక్కొంటున్నాడు. "ఎవరన్నా మొయ్యాలిరా నన్ను; కాళ్ళు
కర్రల్లా ఉన్నాయి" అన్నాడు.

శంకరం అవతలి ఒడ్డుకి ఈదుకువెళ్ళాడు. నీళ్ళకోసం వచ్చిన
ఒక అమ్మాయి దగ్గర బిందె పుచ్చుకొని లోతునీళ్ళు ముంచి ఇచ్చాడు.
ఆ అమ్మాయిలంతా అడిగారు – లోతుగా నీళ్ళు ముంచి ఇమ్మని.

యాజులు గట్టిగా కేకలుపెట్టాడు. "ఓరేయి! నేనూ వస్తున్నా
నుండ్రోయి. ఏ అమ్మాయి! వాడికివ్వకు నేను ముంచిస్తాను నీకు."

శంకరం వెనక్కి తిరిగి నవ్వాడు. తామరపువ్వులూ ఆకులూ

కలకల కదిలాయి. నీటికెరటాలు తళుక్కుమన్నాయి. యాజులుకి ఈతరాని మూలంగా ఊరికే కేకలతో ఊరుకొన్నాడు.

అంతా గట్టెక్కి తుడుచుకున్నాం. యాజులు నాలుగుసార్లు తిడితే గాని శంకరం రాలేదు.

"ఓ, యెంత బాగుందిరా!" అన్నాడు.

"ఏడిశావు! ఆడపిల్లలు నేనల్లా నుంచోమంటే నుంచోవాలి" యాజులు తన కథలన్నీ చెప్పడం మొదలెట్టాడు; అనేక చోట్లవి, అనేక సందర్భాలు, అంతా ఆ కథలన్నీ కోతలన్నట్లు చిరునవ్వు నవ్వి ఊరుకున్నారు.

"మీకు నమ్మకం లేదుకాదూ! మీకు చూపిస్తాను నా తడాఖా! ఒక అమ్మాయిని గట్టిగా మొహంలోకి చూసి ఏ అమ్మాయి, నువ్వీ రాత్రి, ఫలానిచోటికి వచ్చితీరాలి అంటాను. అంటే రాత్రి సరిగ్గా అన్ని గంటలకి, ఆ చోటికి, ఆ అమ్మాయి వచ్చి తీరవలసిందే .... .... ...." అంతా మళ్ళీ చిరునవ్వు నవ్వి ఊరుకున్నారు.

గదుల్లో బట్టలు ఆరవేసి భోజనానికి బయలుదేరాం. భోజనాలు ఒక సత్రంలో ఏర్పాటు చేశారు. ముందు ఒక సన్నపాటి నడవ లోంచి లోపలికి వెళ్ళాం. నడవలో ఒక కరణంగారు కుర్చీలో కూర్చున్నారు.

"ఏ టీమ్ అండయ్యా" అడిగాడు.

"ఫ్రెండ్స్ యానియన్" అన్నాడు వెంకట్రావు.

ఆ కరణంగారు కొన్ని కాగితాలు తిరగేసి "సరేనండి! ఆరుగురు" అన్నారు మేము ఏడుగురం ఉండడం కనిపెట్టినట్టు.

"లెక్క ఉందాండి?" అన్నాడు యాజులు.

"లెక్కేనండి."

"ఇదే మొదలనుకుంటాను ఈ వూళ్ళో టోర్నమెంటు పెట్టి .... కరణంగారికి మన సంగతి తెలియదు" అన్నాడు యాజులు.

"ఏమోనండి; పెదకాపుగారు చెప్పిన ప్రకారము అంతేనండి."

యాజులు మమ్మల్ని ముందు లోపలికి వెళ్ళమన్నాడు. వెంకట్రావు పోనీ పైగా డబ్బిచ్చేద్దామా అన్నట్టు తటపటాయించాడు. యాజులు మాత్రం గదిమి లోపలికి నెట్టాడు మమ్మల్ని.

"కరణంగారికి మన సంగతి తెలియదు. మనకి ఏ టోర్నమెంటులో నన్నా సరే, ఫ్రీ!" మాకింక యాజులు మాటలు వినబడలేదు.

మొదటి పంక్తి లేచారు. విస్తళ్ళన్నీ తీసి స్థలం బాగు చేస్తే కాని రెండో పంక్తి కూర్చోడానికి వీల్లేదు. రెండు పెద్ద సావడులు, మధ్య ఖాళీస్థలం. ఖాళీస్థలానికి రెండుపక్కలా ఎత్తయిన గోడలు. ఒక గోడలో తలుపు వుంది. తెరిచి ఉన్న తలుపులోంచి అవతల కొంచెం దూరంలో ఒకపెద్ద మోట నుయ్యి, మామిడితోట కనపడు తున్నాయి.

ముగ్గురు దాసీలు చటుక్కుని గుమ్మంలోంచి లోపలికి అడుగు పెట్టారు. ఇద్దరు పొట్టీ, ఒకతె పొడుగు. సావడి గుమ్మం దగ్గర మొదటిపంక్తి జనం, రెండో పంక్తి జనం గుమిగా ఉన్నారు. ఏమూలో ఆ గుంపులోంచి "గజ్జెల సింగారం, గాజుల మల్లారం!" అన్నారు. ఎవరికి తోచిన కేకలతో వారు దాన్ని బలపరిచారు; పెద్దగోల అయింది.

"అదీ.... .... టమకటమో!"

"ఊఁ"

"ఆఁ - "

"ఈఁ.... ఈఁ...."

"బు బ్బు బ్బూ!"

పొడుగుపాటి ఆమె ఇంకా పొడుగ్గా నిలబడింది. పొట్టివాళ్ళు కంగారుచేత ఇంకా పొట్టిగా అయిపోయారు. మీసాల నాయుడొకడు దొడ్డిగుమ్మంలోంచి లోపలికి వచ్చాడు.

"ఏంటదీ?" ధాటీగా అడిగాడు. అందరి గుండెలూ ఒక్కసారి కొట్టుకొన్నాయి. ఎక్కడో వెనక ఏదో అల్లరి మళ్ళా లేవబోయింది గాని వెంటనే భయంచేత ఆగిపోయింది.

"తుడవండీ!" నాయుడు ఆజ్ఞాపించాడు. పొట్టివాళ్ళిద్దరూ బెదురుతూ రెండడుగులు వేశారు.

"ఉండడల్లా. ఏటా తొందర" పొడుగుది అంది. నాయుడు కేసి తిరిగింది. అరంతా ఉండగా తుడవ్వం. అతల నించో మెట్టండి." గొప్పగా నిర్లక్ష్యంగా; అవమానించబడిన మానంలా ఎత్తుగా ఆమె మాకేసి చూసింది. గుంపంతా తప్పుచేసినట్టుగా ముడుచుకుపోయింది. నడ్డిమీద రెండు చేతులు వేసుకుంది. వెనక్కి విరగకట్టిన చీర క్రింద ఆమె మోకాళ్ళు నున్నగా, లావుగా బలంగా ఉన్నాయి. వెనకనించి ముందుకి తిప్పి గుత్తంగా దోపిన పయిటకింద రొమ్ము ఉద్రేకంతో గబగబా లేచివాలింది. మేమంతా జంకిపోయాం.

"ఆళ్ళకి మాత్రం అక్కా సెల్లెళ్ళు లేరో" ఉమ్ము వేసినట్టుగా ఆమాట విసిరింది మామీదకి.

నాయుడు మమ్మల్ని అవతలికి గెంటుతుండగా యాజులు తోసుకు ముందుకు వచ్చాడు. ఆ అమ్మని తేరిమాశాడు.

"ఓరి చవటల్లారా! తప్పుగాదట్రా? ఏమిటా అల్లరి? మంచీ చెడ్డా ఉండొద్దూ?" మమ్మల్ని గెంటడంలో నాయుడికి సహాయం చేసి నాయుడితో కూడా లోపల ఉండిపోయాడు.

తన్నుతిన్న కుక్కల్లా అంతా గుమ్మం అవతల నిలబడ్డాం. కేకలువేసిన వాళ్ళని వాళ్ళ స్నేహితులు రహస్యంగా మందలిస్తున్నారు. నాయుడు దొడ్డిగుమ్మంలోంచి వెళ్ళిపోయాడు. అధికారమంతా తన మీదకి ఆరోపించుకుని మా యాజులు "తొందరగా తుడవండే! ఊఁ; తొంచరగా!" అన్నాడు; పొడుగు పాటి దాసీని చూస్తూను.

మమ్మల్ని చూసినట్టుగానే వాణ్ణి చూసింది. మేమంతా ఒకసారి జంకాం; వాడిమీద ఆడపులిలాగ పడుతుందేమోనని.

తుడవడం అయిపోవడంతోటి అంతా లోపలికి వచ్చాం. భోజనా లయిందాకా ఎవడూ గట్టిగా మాట్లాడలేదు. శంకరం మాత్రం

"ఓ యెంత బాగుందీ" అనుకుంటున్నాడు.

యాజులు ఒక్కడే ధైర్యంగా అన్ని విషయాలను గురించీ మాట్లాడుతున్నాడు. అల్లరి చేసినవాళ్ళు యిది ఎంతవరకూ వెడుతుందోనన్నట్టు బెదిరి బెదిరి చూస్తున్నారు.

యాజులన్నాడు; "అల్లరి యెందుకురా? చేతకానితనం!.... .... ధైర్యం వుంటే ఒక అర్ధరూపాయి చేతిలోపెట్టి 'నామాట ఏం చెప్పావు' అనాలికాని."

"ఏమిట్రా వెధవగొడవ? ఈవూరు నుంచి సరిగ్గా కదలాలని లేదేమిటి నీకు? ఊరికే అనవసర సంభాషణ చేస్తే మక్కెలు విరుగుతాయి" - వెంకట్రావు విరాగ్గా అన్నాడు.

"ఎవడ్రా, మన్ని కొట్టేవాడు?........ ఇదుగో, ఇల్లా చూడు! మనం ఏపిల్లనయినా సరే; 'రా' అంటే రావాలి! - తెలిసిందా?"

"చాల్లెద్దు; పెద్ద గొప్ప చెపుతున్నావు!.... ....వీపు విట్లే దాకాను—"

అంతా చేతులు కడుక్కొని అవతలికి వెళ్ళిపోతున్నాం; "మీరు లాడ్జికి పొండిరా; నాకు కొంచం పనుంది!" అన్నాడు యాజులు.

మేం ఇవతల గుమ్మం దగ్గర తటపటా యిస్తున్నాం. ఆవేళ ఏదో ముప్పుకే వచ్చిందని అనుకున్నాం.

వెంకట్రావు వెనక్కి తిరిగి అన్నాడు, "ఏరా, వస్తావా, రావా, చెప్పెయ్యి! ఇంక నీకూ మాకూ కుదరదు!"

"అయితే పొండోయి; కొంప మునిగిపోయినట్టు!"

కాని మేం వెళ్ళలేక పోయాం, గుమ్మం దగ్గరే తటపటాయిస్తున్నాం.

దాసీలు విస్తళ్ళు తీస్తున్నారు. యాజులు చుట్టముట్టించి పచారు చేస్తున్నాడు. యాదాలాపంగా ఆమె వున్న దగ్గరకి వెళ్ళాడు. స్తంభాన్ని జేరబడి చుట్టపొగ నెమ్మదిగా వదుల్తున్నాడు. ఆమె నిర్లక్ష్యంగా విస్తళ్ళు లాగుతోంది, వంగుని.

"నీపేరు?"........ ఆమె చాలాసేపు ఆగి సమాధానం చెప్పింది.

"గంగమ్మ"

"నీ మొగుడేం చేస్తుంటాడు ?"

"కల్లు కీత"

మాకు కీతకత్తి చేత్తో పుచ్చుకొని ఎఱ్ఱటి కళ్ళతో మా వెనుక ఎవరో వచ్చి నిలబడినంత భయం వేసింది.

"ఈడిగలా ?"

"శెట్టిబలిజ."

"రెండూ ఒకటేగా" యాజులు ఉమ్మువేసుకుని చుట్ట మళ్ళీ నోట్లో పెట్టుకొన్నాడు.

మా అందరి గుండెలు దడాదడా కొట్టుకొంటున్నాయి.

"చుట్ట కాలుస్తావా ?"

"అక్కర్లేదు"

"చుట్ట కాల్చేటట్టున్నాయి నీ పెదిమిలు ?"

"ఇప్పుడక్కర్లెదు."

"ఉండనియ్యి. అనక కాలుద్దుగాని........ మా మంచిపొగాకు"

యాజులు చుట్ట క్రింద గిరవటేశాడు. గంగమ్మ తీసుకోలేదు. వెంకట్రావు ఉడికిపోతున్నాడు కోపంతో. మేమంతా భయపడి పోతున్నాం.

"మీ యిల్లెక్కడ ?"

"ఈ తోటవతలే. ఇపుడు పొలాల్లో కెళ్ళిపోద్దు ; కల్లు కీతకి."

గంగమ్మ చేతులు కడుక్కొని నిర్లక్ష్యంగా నడుస్తో యాజులు పక్కనించి వెళ్ళి చుట్ట తీసుకుంది. అరుగు చివర కూర్చుని చుట్ట అంటించింది. తక్కిన దాసీలింకా విస్తళ్ళు తీస్తున్నారు.

నడవలో మా పక్కనించి మాపాల నాయుడు ఉరుముకుంటో సావడిలో కొచ్చాడు. మేమింక భయపడి మా గదికి వచ్చేశాం.

మాలో మేం తీర్మానించుకొన్నాం ; యాజులుకి గట్టి మోతాదు ఇవ్వాలని.

వీరన్న అన్నాడు: "ఏమిటండిదీ?.... మనందరికీ చెడ్డపేరు వస్తుంది. మంచీ చెడ్డా ఉండక్కర్లెదూ? ఇంక మనతో ఎక్కడికీ రావొద్దని చెప్పేద్దామంతే. మనపరువు ప్రతిష్టాకూడా పోతాయండీ."

"ఈ వూళ్లో పెచ్చు రేగొట్టి పంపిస్తారు, ఏమన్నా ఎచ్చు తగ్గు లొస్తే! కొత్తాలేదు, పాతాలేదు, వెధవకి!"

"పైగా వెధవ డాబులన్నీ చెపుతాడు; ఇక్కడ ఇల్లా అయింది, అక్కడల్లా అయిందని! శుద్ధ పచ్చికోతలు! వీడి అందానికి లోకంలో ఆడవాళ్ళంతా పడి ఏడుస్తోన్నట్టుగా–"

"ఉన్న ఊళ్ళోఅయితే ఫరవాలేదురా, ఎల్లా ఏడిచినా! పొరుగూరొచ్చి తన్నులు తింటే ఇంక ఏమందంగా ఉండాలో ఉంటుంది!"

ఎవళ్ళ మనస్సులో వాళ్ళు ఉరుముకుంటూ పక్కలు వాల్చాం. రాత్రి నిద్ర లేకపోవడంచేత, ఆట ఆడిన అలసటచేత; వెంటనే నిద్రపట్టింది.

మాకు నిద్ర మెలకువ వచ్చేసరికి యాజులు మాపక్కని పడుకుని నిద్రపోతున్నాడు.

ఎండ వేడిగా, మసగ్గా అలసటగా ఉంది. నేలమీద నుంచి ఏదో పొగలాగ గాలిలో కలిసిపోతున్నట్టు అనిపిస్తోంది. నీడలు అప్పుడే తూర్పువేపు కొంచెం పొడుగ్గా సాగాయి. గాలి ఎక్కడా కదలడంలేదు. చెమట తుడుచుకుంటూ అల్లాగే మెలకువగా ఇంకో అరగంట పక్కల మీద దొర్లాం.

నాలుగున్నరకి యాజులు లేచాడు. అంతా నూతిదగ్గర మొహాలు కడుక్కున్నాం. చల్లటి నూతినీళ్ళు ఒంటికి తగిలేసరికి మా కోపాలన్నీ చల్లబడిపోయాయి. యాజులు ఏకంగా స్నానమే చేశాడు.

"చెరువుకి పోదామా?" అన్నాడు శంకరం.

"ఏడిశావు, తెలివి! ఇప్పుడు కాగిపోయి ఉంటాయి. నీళ్ళు" అన్నాడు వెంకట్రావు.

బట్టలు వేసుకొని ఎక్కడికి పోదామా అని ఆలోచించాం. ఆ ఊరేమీ మాకు తెలియదు.

"బేస్తు ఆడుకుందాంరా?" అన్నాడు శంకరం.

"నాకు కొంచెం పనుందిరా" అని తలదువ్వుకుంటూ అన్నాడు యాజులు.

"ఒరేయి! ఏమన్నా ఇరుకులో పడ్డావంటే మే మెవళ్ళంరాము, తెలిసిందా?" అని హెచ్చరించాడు, వెంకట్రావు.

"చాల్లేరా! మనం అసలు చాలా శాస్త్రప్రకారం మొదలు పెడతాం; తెలుసునా?"

"ఆ! ఇందాకా శాస్త్రప్రకారమే మొదలుపెట్టావు; ఆ గంగమ్మ తోటి. ఈసారి వెళ్ళు; దాని మొగుణ్ణి పిలిపించి వుంటుంది!"

"అంత పతివ్రతలు భూలోకంలో లేరు!" యాజులు ఈలవేసు కుంటూ వెళ్ళిపోయాడు.

మేము బేస్తు మొదలుపెట్టాము.

మొదటి ఆట వెంకట్రావు రెండో ఎత్తు వేశాడు; పోడి ఒస్తే ఆటకి. పోడిరాలేదు, బేస్తుకి పారేశాడు. మళ్ళీ ఆట, వెంకట్రావు; ఆసురాజుతో ఆరు వేశాడు. పోడి కలవకపోయినా మారు ఆసు కలిసింది. నవ్వుమొగంతో అసు ఆడాడు. ఒంట, రెండు రద్దులు. తక్కిన నాలుగూ వీరన్న పట్టుకున్నాడు. మళ్ళీ బేస్తు. వెంకట్రావు తెల్లబోయి చూశాడు. రెండుసార్లు ఎవళ్ళకీ ఆటపడలేదు.

మూడోసారి శంకరం చేతిపీలు సొంతం కొట్టేశాడు.

ఆటంతా అల్లాగే నడిచింది. వెంకట్రావు ఎంత పెద్ద ఆటవేసినా పోవడం; శంకరం ఎంత చిన్నాటవేసినా నెగ్గడం. పేక పక్షపాతం చూపిస్తున్నట్టు చిరాకుపడ్డాడు వెంకట్రావు. చివరికి శంకరం బాగుం డదని ఒక మూడో ఎత్తుకి వేలు పెట్టి; అర్ధణా అర్ధణా పంచాడు.

ఇంక భోజనాలకి పొద్దుపోతుందని ఎనిమిది గంటలకి లేచారు.

వెన్నెల పుచ్చ పువ్వులా విరిసింది.

చల్లటి పైరుగాలి దాళవా వేల కమ్మటి వాసనతో కలసి వస్తోంది. ఊరంతా పల్చని మేలిముసుగు వేసుకున్న నల్లటి ప్రౌఢలా ఉంది. కొబ్బరిచెట్లు నల్లటి తలలతో, మాయగా కనబడుతున్నాయి. వెన్నెలలో బయట మంచాలు వేసుకొని దారికి ఇటూ, అటూ జనం పడుకుని ఉన్నారు, మెలకువగానే.

భోజనాలు చేస్తోంటే మాకు యాజులు సంగతి జ్ఞాపకం వచ్చింది. "ఎక్కడికి పోయాడు?" అనుకున్నాం ఏదో ముఖ్యవిషయం మరిచి పోయినట్టుగా.

"ఏదో మనదగ్గర కొయ్యడానికి కథ అల్లుకుని వస్తాడు" అన్నాడు శంకరం.

భోజనాలు అయాక సత్రం ఇవతల పచ్చిక మీద కూర్చున్నాం, కిళ్ళీలు వేసుకుని. వెంకట్రావు ఇంకా అందరిమీదా కోపంగా ఉన్న ట్టుగా ఉన్నాడు; బేస్తు చిరాకుతో.

"ఓ, ఎంత బాగుందిరా" అన్నాడు శంకరం.

ఏమూలనించో 'గంగమ్మ నీ మొగుడు' అని పాట వినపడింది.

యాజులు వేపబెత్తం ఊపుకుంటూ వచ్చి మమల్ని ఆనవాలు పట్టి మాపక్కని కూర్చున్నాడు.

"ఏరా, రెండో పంక్తిలో వచ్చారేమిటి, మీరు? బేస్తు విశేషా లేమిటి?"

"శంకరం తొక్కి వచ్చాడ్రా"

"నీ భోజనమో ?" వీరన్న అడిగాడు.

"మొదటి పంక్తిలో! అన్నాడు యాజులు. మహ గమ్మత్తు అయి పోయిందిలే.........ఆ మీసాల నాయుడు చాలా కోపంగా ఉన్నాడు!"

"ఏం, ఏం; ఏం జరిగింది? పట్టుకుని కొట్టించడు గదా!" అంతా ఆదుర్దాగా అడిగాము.

'వాడి మొహం!........నేనూ అదీనీ, దాని గుడిసిలోంచి వస్తు న్నాంరా! ........వాడు అక్కడ తచ్చాడుతున్నాడు. వాడికి వీలు దొరక నియ్యలేదుటది."

"అదెవరు ?"
"ఆహా! ఆ గంగమ్మ రా."
"కొయ్యి" అన్నాడు శంకరం. అందరికీ అదే తట్టింది.
"ఓరి మగాళ్ళలారా! ఇంతేనా మీరు? ఎవరికయినా ఓపికవుంటే ఈరాత్రి కుదురుస్తాను!" యాజులు లేచి నిలబడి అన్నాడు.
"లేవండ్రా!" అంతా లేచాం "కొట్టించవు గదా?" వీరన్న అనుమానంగా అన్నాడు.
దీనితో వీడి గర్వం కాస్తా మట్టి కలిసిపోతుందని అంతా నిశ్చయించుకున్నాం.
మాకు దారి చూపిస్తో యాజులు అన్నాడు: "ఎవత్తినయినా కాస్త తడిమి చూడాలనుంటే దాని ముఖంలోకి చూస్తూ మొగుడి పేరు అడుగు. . . అపుడు నీకేసి ఎలా చూస్తుందో, ఊపిరి ఎల్లా తీసుకుంటుందో చూడంతే! నీచేతులో వెన్నముద్దలా అయిపోతుంది ఏ ఆడదన్నా సరే."
"అది మనకేసి చూడకపోతే?" శంకరం అడిగాడు.
"చూసి తీరుతుంది...... నీకు చేవుంటే"
సత్రం దగ్గర తోటలో మోటనుయ్యి దగ్గర మేమంతా నిలబడ్డాం. కొంచెం దూరంలో దాసీలు అంట్లు తోముతున్నారు. యాజులు వాళ్ళ దగ్గరకు వెళ్ళి గంగమ్మను పేరుపెట్టి గట్టిగా పిలిచాడు.
మా అందరి గుండెలు భయంతో కొట్టుకున్నాయి.
గంగమ్మ నూతి అంచుదగ్గరకు వచ్చి మావేపు చూస్తో నిలబడింది.
యాజులు చనువుగా గర్వంగా అడిగాడు: "మావాడొకడున్నాడు. ఈ రాత్రికి వీలుంటుందా?"
మాకందరికీ గొంతుక దాకా ఏదో పొంగింది.
ఆమె ఒకక్షణం పని ఉన్నట్లు నూతిలోకి చూసి "ఇయ్యాల కాదండీ. రేపు రమ్మనండి. ఇయ్యాలకి—"

యాజులు ఆమెకంటె పొడుగ్గా, గర్వంగా, గొప్పగా, రాజులాగ నిలబడ్డాడు. ఆమె మళ్ళీ వెళ్ళిపోయింది.

మేము మకాం దగ్గరకు చేరుకునేదాకా మా మనస్సులు స్థిమిత పడలేదు. యాజులు ఏదో తన కథలు చెపుతూనే ఉన్నాడు.